క్లుప్తంగా

చిత్రకారుడు శ్రీనివాస్‌కు అభినందన



చిత్రకారుడు శ్రీనివాస్‌ను అభినందిస్తున్న మంత్రి దుర్గేష్

మల్కాపురం: ప్రముఖ చిత్రకారుడు ద్వారపూడి శ్రీనివాస్‌రావును రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ అభినందించారు.ఈ నెల 4న రాజమహేంద్రవరంలో చిత్రకళా ప్రదర్శన నిర్వహించారు.ఈ ప్రదర్శనలో 60వ వార్డు శ్రీహరిపురం ప్రాంతానికి చెందిన ద్వారపూడి శ్రీనివాస్‌రావు పాల్గొని ఓ స్టాల్ ఏర్పాటు చేసి తను చిత్రించిన పలు చిత్రాలను ప్రదర్శనలో ఉంచారు.వాటిని తిలకించిన మంత్రి కందుల దుర్గేష్ తదితరులు శ్రీనివాస్‌ను అభినందించారు.

రహదారి పనులకు శంకుస్థాపన

గోపాలపట్నం:జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురం, కంపరపాలెంలో రహదారి పనులకు ఎమ్మెల్యే గణబాబు శనివారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ వార్డులో జీవీఎంసీ నిధులు 82.52 లక్షలతో సిమెంట్ రోడ్డు, బీటీ రోడ్డు పనులు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ హేమావతి, 89వ వార్డు కార్పొరేటర్ రమేష్ నాయుడు, డీఈ వీరయ్య, బొడ్డేటి విజయ్, అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ పాల్గొన్నారు.

12న హనుమాన్ శోభా యాత్ర

మహారాణిపేట: ఈనెల 12న నగరంలో హనుమాన్ శోభా యాత్ర పేరిట భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు. ర్యాలీ కోసం హనుమాన్ విజయోత్సవ కమిటీ ఆధ్వర్యంలో నగర పరిధిలో ఐదు ప్రాంతాల నుంచి ప్రణాళిక తయారు చేశారు. పెందుర్తి, గాజువాక, మారియట్ హోటల్, ఆనందపురం, పోస్టాఫీసు తదితర ప్రాంతాల గుండా సాగే ర్యాలీ సాయంత్రం 5 గంటలకు బీచ్ రోడ్డులోని పార్క్ హోటల్‌కు చేరుతుంది. అక్కడి నుంచి హనుమాన్ శోభా యాత్ర మొదలై కాళీమాత దేవాలయం వరకు సాగుతుంది.

1514వ రోజుకు చేరిన ఉక్కు పోరాట దీక్షలు



దీక్షలో ఏఐటీయూసీ కార్యకర్తలు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 1514వరోజుకు చేరాయి. దీక్షలో ఏఐటీయూసీ కార్యకర్తలు పాల్గొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ చైర్మన్ అదినారాయణ మాట్లాడుతూ కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని.. ఉద్యోగులకు నెలనెలా జీతాలు సక్రమంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపును ఆపాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎండీ ఆలెసా, మంత్రి రవికిరణ్, సుధాకర్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆప్కాస్‌లో కొనసాగించాలి



కార్మికుల సంతకాలు సేకరిస్తున్న నాయకులు

అగనంపూడి: జీవీఎంసీ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల్ని ఆప్కాస్ నుంచి తొలగించి ప్రైవేటు కాంట్రాక్టర్‌కు అప్పగించాలనే ఆలోచన, ప్రతిపాదనలను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ శాఖామంత్రికి అందివ్వనున్న వినతిపత్రంపై కార్మికుల సంతకాల సేకరణ చేపట్టారు. 85,86,88 వార్డుల్లోని కాంట్రాక్ట్ కార్మికులు,పారిశుధ్య కార్మికులు విధుల్లో ఉండగా వారి వద్దకు వెళ్లి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ పారిశుధ్య, నీటి సరఫరా విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను ఆప్కాస్ నుంచి తొలగించి ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పగించొద్దన్నారు. కార్యక్రమంలో గొలగాని అప్పారావు, పద్మ, దివ్య, అరుణ, సత్యవతి, నాగరాజు, సూర్యకాంతం, నడిపల్లి రాజు, కొండలరావు పాల్గొన్నారు.



దుర్గానగర్‌లో శిథిలావస్థలో కాలువలు



రహదారుణం



గొల్లకంచరపాలెంలో శిథిలావస్థలో రోడ్లు, కాలువలు



గౌరీనగర్ రహదారి దుస్థితి

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధిలోని పలు కాలనీల్లో సీసీ రోడ్లు శిథిలమయ్యాయి. మట్టిరోడ్లను తలపిస్తున్నాయి. పిక్క తేలి గుంతలమయంగా ఉండడంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అటుగా రాకపోకలు సాగించాలంటే ఆందోళన చెందుతున్నారు.

గోతుల పూడ్చివేతలో నిర్లక్ష్యం

యూజీడీ పైపులైన్ల కోసం తీసిన గోతుల్లో పైపులు వేసి గోతులు పూడ్చి వదిలేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ రావడంతో పనులు తూతూ మంత్రంగానే జీవీఎంసీ అధికారులు ముగించేశారు. దీంతో రహదారులు గోతులు మయంగా మారాయి.

ఈ ప్రాంతాల్లో అధ్వానం

కంచరపాలెం–ఊర్వశికూడలి పరిధిలో గొల్లకంచరపాలెం రైల్వేట్రాక్ రహదారి నుంచి గౌరీనగర్‌కు వెళ్లే రహదారి, తోటవీధి, గోకుల్‌నగర్, దుర్గానగర్, చెవిటిరాములవీధి, రామ్మూర్తిపంతులుపేట, గవరకంచరపాలెం, దయానందనగర్ ప్రాంతాల్లో రోడ్లు మరీదారుణంగా ఉన్నాయి. జోన్–5 ఇంజినీరింగ్ అధికారులకు ఫిర్యాదు చేస్తే ఎన్నికల కోడ్ అంటూ నాడు కాలయాపన చేశారని.. నేడు ఇటు కన్నెత్తి చూసే పరిస్థితి కనిపించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. రామూర్తిపంతులపేట, గొల్లకంచరపాలెం, గౌరీనగర్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో పైపులైన్ కోసం తీసిన మట్టి రోడ్లకు సగంమేర ఉండడంతో అటుగా వెళ్లే ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆపై వీధిదీపాలు సక్రమంగా వెలగకపోవడంతో పరిస్థితి మరీ కష్టతరంగా మారింది. ఆయా కాలనీల్లో జరిగిన పనులపై జోనల్ అధికారులకే క్లారిటీ లేదని పలువురు విమర్శిస్తున్నారు. కాగా ఇంజినీరింగ్ అధికారులు మాత్రం యూజీడీ, 24/7 డిపార్ట్‌మెంటు అధికారుల పర్యవేక్షణలో కాంట్రాక్టర్లు తవ్విన గోతులను వారే పూడ్చాలని చెబుతున్నారు.

ప్రజాప్రతినిధులు ఎక్కడ

వార్డు ప్రజలు రోడ్లు లేక.. లైట్లు వెలగక నానా ఇబ్బందులు పడుతున్నా వార్డు కార్పొరేటర్ జాడ కనిపించడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉండడం వల్ల నిధులు సక్రమంగా మంజూరు చేయలేదని కాలయాపన చేసిన కార్పొరేటర్ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే 10 నెలలు గడిచినా ఎందుకు అభివృద్ధిపై దృష్టిసారించడం లేదని ప్రశ్నిస్తున్నారు.



మట్టిరోడ్డును తలపిస్తున్న గోకుల్‌నగర్ రహదారి

గోతులతో ఇబ్బందులు

మా కాలనీలో గోతులు తవ్విన చోట కనీసం సీసీ రోడ్డు వేయలేదు. ఉన్న సీసీ రోడ్లు రాళ్లు తేలి ప్రమాదకరంగా ఉన్నాయి. శిథిలమైన రోడ్లపై కనీసం నడవలేక పోతున్నాం. ద్విచక్ర వాహనదారులు జారి పడుతున్నారు. సీసీ రోడ్డు నిర్మించాలని సచివాలయంలో ఫిర్యాదులు చేసినా స్పందించడం లేదు. వర్షాలు పడితే గెడ్డవీధిలో గోతులు కనిపించడం లేదు.

– ఎం. జశ్వంత్, గౌరీనగర్, ఊర్వశికూడలి

అధికారులు స్పందించాలి

వార్డులో అభివృద్ధి పనులకు తవ్విన గోతుల్లో సిమెంట్ కాంక్రీట్ వేయలేదు. గతంలో నిధులు మంజూరు చేశారని చెప్పారు. ఎన్నికల కోడ్ వల్ల పనులు ఆపేశారని అధికారులు చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు గడిచినా ఎన్నికల కోడ్ తొలగినా పనులు ప్రారంభించకపోవడం దారుణం. సంబంధిత అధికారులు స్పందించాలి.

– కె.కనకేశ్వరరావు, కంచరపాలెం.

యువత ఆదర్శంగా నిలవాలి



మాట్లాడుతున్న ఎన్ఎస్ఎస్ నోడల్ అధికారి భాగ్యలక్ష్మి

మల్కాపురం: తల్లిదండ్రులను,గురువులను గౌరవిస్తూ సమాజంలో మంచి పేరు తెచ్చుకునే స్థాయికి నేటి యువత ఎదగాలని ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అన్నారు.మల్కాపురం సెయింట్ ఆన్స్ కళాశాలలో శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. చదువు వల్ల సమాజంలో మనకో గుర్తింపు వస్తుందని, అంతే కాక మంచి ఉపాధి సాధించి నమ్ముకున్న వారికి దారి చూపిన వారు అవుతారన్నారు. చెడు అలవాట్లుకు దూరంగా ఉంటూ,మంచి స్నేహితులు,మంచి పుస్తకాలతో పరిచయాలు పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో పూజలు



పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి

మల్కాపురం:జీవీఎంసీ 61వ వార్డు ప్రకాష్‌నగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామికి మేల్కొలుపు, సుప్రభాత సేవ నిర్వహించారు.అనంతరం స్వామికి పంచామృతాలతో అభిషేకాలు చేసి స్వామిని తులసి,సుగంధ మాలలతో అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం శ్రీదేవి,భూదేవి సమేత వేంకటేశ్వర స్వామికి ఆలయ అర్చకులు పవళింపు సేవ చేపట్టారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్ రామ్



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బెహరా భాస్కరరావు



ప్రకాష్‌నగర్ వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

గోపాలపట్నం: నియోజకవర్గంలో పలు చోట్ల బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ విగ్రహాలు, చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఉప ప్రధానిగా అందించిన సేవలను నాయకులు, వక్తలు కొనియాడారు.

- 91వ వార్డు లక్ష్మీనగర్ నాలుగు కుళాయిల వద్ద, బాజీ జంక్షన్ ప్రాంతాల్లో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు ఎమ్మెల్యే గణబాబు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన నాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో కడితి సాధూరావు, రమేష్ బాబు, అలజంగి శ్రీనివాసరావు, రమేష్ పాల్గొన్నారు.
- జీవీఎంసీ 91వ వార్డు నాలుగు కుళాయిల వద్ద బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బెహరా భాస్కరరావు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బండి దుర్గేష్, గొటివాడ నాగేశ్వరరావు, సీతారామ్, ఉమామహేశ్వరరావు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక వాడలో...

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వుడాకాలనీ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో దళిత సంఘ నాయకుడు రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు మళ్ల ధనలత,సూకరెడ్డి తదితరులు బాబూ జగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దళిత వర్గ ప్రజలకు,దేశాభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

- 61వ వార్డు ప్రకాష్‌నగర్ వద్ద బాబూ జగజ్జీవన్‌రామ్ విగ్రహానికి సీపీఐ జిల్లా నాయకులు కాండ్రేంగుల సత్యాంజనేయ,గుడాల రాంబాబు తదితరులు నివాళులర్పించారు.ఇదే ప్రాంతంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ నాయకుడు పెద్దిరెడ్ల నానాజీ వేరుగా పాల్గొని జగజ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించారు.



గుల్లలపాలెం వద్ద నివాళులర్పిస్తున్న దళిత సంఘ నాయకులు,వైఎస్సార్‌సీపీ నాయకులు



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్‌లో జనతాకాలనీ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భారత మాజీ ఉప ప్రధాని దివంగత బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. సంఘ గౌరవాధ్యక్షుడు ఎం.హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి సీహెచ్ రామారావు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఎన్నో సేవలు అందించిన ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకు సాగాలని సూచించారు.



లక్ష్మీనగర్ ఈ బ్లాక్ వద్ద జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

కాంట్రాక్ట్ కార్మికుల రాస్తారోకో



కూర్మన్నపాలెంలో ఆందోళన చేస్తున్న కార్మికులు



మోహరించిన పోలీసులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుల తొలగించడాన్ని నిరసిస్తూ కూర్మన్నపాలెంలో శనివారం సాయంత్రం కార్మిక సంఘాలు రాస్తారోకో నిర్వహించాయి. ఈ సందర్భంగా కార్మికులు యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అయితే పోలీసులు భారీగా మోహరించారు. ఆందోళన కారులను నిలువరించారు. కార్మిక సంఘాల నాయకులు మంత్రిరాజశేఖర్, ఆదినారాయణ గంగారామ్ తదితరులు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం నిరంకుశ వైఖరి విడనాడాలని డిమాండ్ చేశారు. మెడికల్ టెస్టులు, ఇతర పేర్లు చెప్పి కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడం మానుకోవాలన్నారు. లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కొమ్మలు నరికారు.. తరలించడం మరిచారు!




శ్రీరామ్‌నగర్ సర్వీసురోడ్డులో విడిచిపెట్టిన కొమ్మలు

మల్కాపురం: శ్రీహరిపురం విద్యుత్ ఉప కేంద్రం సిబ్బంది శుక్రవారం గుల్లలపాలెం,శ్రీరామ్‌నగర్,శ్రీహరిపురం తదితర ప్రాంతాల్లో విద్యుత్ హెచ్‌టీ,ఎల్‌టీ వైర్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించారు. ఇలా తొలగించిన కొమ్మలను వెంటనే తొలగించాల్సి ఉంది. కానీ శనివారం సాయంత్రం వరకు వాటిని సిబ్బంది తొలగించలేదు. దీంతో ఆ సేవా మార్గాల్లో ప్రయాణించే వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కొమ్మలను తొలగించాలని ఆ ప్రాంత శానిటరీ అధికారి, విద్యుత్ సిబ్బందికి తెలిపినా వారు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.




గుల్లలపాలెం సర్వీసు రోడ్డులో ఇలా..

అన్నిరంగాల్లో రాణించాలి



విజేతలతో డాక్టర్ సిస్టర్ షైజీ, జయలక్ష్మి



మాట్లాడుతున్న మనోరంజని

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన వీడ్కోలు వేడుకలు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ నేతృత్వంలో ఉత్సాహంగా జరిగాయి. ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన విద్యార్థినులకు ఘనంగా వీడ్కోలు పలికారు. ముఖ్య అతిథిగా భీమునిపట్నం రెవెన్యూ డివిజన్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఆలిస్ మనోరంజని పాల్గొని మాట్లాడారు. అమ్మాయిల్లో విజ్ఞానం సమాజాభివృద్ధికి దోహద పడుతుందన్నారు. కళాశాలను వీడిన తర్వాత ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. మానవ విలువల ఆవశ్యకతతో పాటు ఈ పోటీ యుగంలో అన్ని రంగాల్లో మహిళలు ముందుకు వెళ్లాల్సిన అవసరాన్ని అందరూ గుర్తుంచుకోవాలన్నారు. పరీక్షా సమయంలో చదువులకు ప్రాముఖ్యత ఇవ్వాలని కోరారు. వివిధ గ్రూపుల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు, డాక్టరేట్ సాధించిన లెక్చరర్లను ఘనంగా సత్కరించారు. విద్యార్థినులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అహూతులను ఆకట్టుకున్నాయి. మిస్ సెయింట్ జోసెఫ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థినులను సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ హేమ, డాక్టర్ పి.కె.జయలక్ష్మి, డాక్టర్ ఇ. హరిణి, రమణిలత, పావని, డాక్టర్ ప్రవీణ్, పవన్, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

'సమ్మెకు మద్దతు ఇవ్వండి'

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల నిరవధిక సమ్మెకు మద్దతు ఇవ్వాలని ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు వారు ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కన్వీనర్లకు లేఖలు అందజేశారు. స్టీల్‌ప్లాంట్‌లో మొత్తం 2148 మంది కార్మికులను తొలగించారన్నారు. మొత్తం 5600 మందిని తొలగించి తీరుతామని యాజమాన్యం ప్రకటిస్తుందన్నారు.

ఎలక్ట్రిక్ ఆటో ప్రారంభం

కంచరపాలెం: జీవీఎంసీ 57వ వార్డు ఊర్వశికూడలి పరిధి తుమ్మడపాలెంకు చెందిన పలపాల గురునాథరావుకు ఏపీ మెప్మా రాపిడో బెనిఫిషరీ పథకం ద్వారా ఎలక్ట్రిక్ ఆటో పొందారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే పి.గణబాబు దాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో గవర కార్పొరేషన్ డైరెక్టర్ పెంటకోట అజయ్‌బాబు, సత్తిరాజు పాల్గొన్నారు.

హెచ్ఎస్ఎల్‌లో నేషనల్ మారిటైమ్ డే వేడుకలు



షిప్‌యార్డ్‌ను సందర్శించిన హైదరాబాద్ సీఐఐ యంగ్ ఇండియన్ సభ్యులు

సింధియా: హిందూస్తాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ సంస్థలో నేషనల్ మారిటైమ్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారతదేశంలో మొట్టమొదటి ఆధునిక షిప్‌యార్డ్, మొదటి విమాన కర్మాగారం, మొదటి కార్ ఫ్యాక్టరీని స్థాపించిన సేఠ్ వాల్‌చంద్ హీరాచంద్ దోషిని గుర్తు చేసుకుంటూ ఘనంగా నివాళులర్పించారు. నేషనల్ మారిటైమ్ డేను పురస్కరించుకుని హైదరాబాద్‌కు చెందిన సీఐఐ–యంగ్ ఇండియన్స్ సభ్యులతో కూడిన 25 మంది షిప్‌యార్డ్‌ను సందర్శించగా, వారికి సంస్థకు చెందిన అధికారులు పలు అంశాలను వివరించారు. 1919వ సంవత్సరం ఏప్రిల్ 5న సింధియా స్టీమ్ నావిగేషన్ మొదటి భారతీయ ఓడ ఎస్ఎస్ లాయల్టీ ముంబై నుంచి లండన్ వరకు ప్రయాణించిందని, నాటి స్ఫూర్తితో ఆత్మ నిర్భర్ భారత్‌కు అనుగుణంగా ఆధునిక నౌకలను నిర్మించడం ద్వారా సేఠ్ వాల్‌చంద్ హీరాచంద్ దోషి కలలకు కట్టుబడి ఉన్నట్లు అధికారులు తెలిపారు.